క్లుప్తంగా

బలరామావతార అలంకరణలో జనార్దన స్వామి


జనార్దన స్వామి

ఏలూరు (ఆర్ఆర్ పేట): స్థానిక అగ్రహారం భూ, నీళా సమేత జనార్దన స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, తిరుప్పావై సేవా కాలం నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. రాత్రి స్వామివారికి బలరామావతార అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

28 నుంచి అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు


అచ్చమ్మ పేరంటాలమ్మ

దెందులూరు: గోపన్నపాలెంలోని అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి 66వ వార్షికోత్సవాలను ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. 28న ఉదయం 9.31 గంటలకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, కోలాటం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.ఫిబ్రవరి 6న మహా అన్నసమారాధన నిర్వహిస్తామని సోమవారం దెందులూరు ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు వివరించారు.

వైభవంగా ఇరుముడి ధారణ

భీమడోలు : స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడుల ధారణ మహోత్సవ వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు చేశారు. మాలధారులు ఇరుముడులను ధరించి జ్యోతి దర్శనానికి శబరిమల తరలి వెళ్లారు. అర్చకులు బృందావనం మధు పవన్ నేతృత్వంలో గణపతి పూజ అనంతరం ఇరుముడుల పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు, 18 పడులు పూర్తి చేసుకున్న సోమరాజు, ప్రసాదరావు, అర్చకులు బృందావన మధుపవన్‌లను దుశ్శాలువాలతో ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఘనంగా సత్కరించారు.

ప్రజాసంకల్ప యాత్ర.. ఓ చరిత్ర

- పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోన్న సీఎం జగన్
- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని


వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని


సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు

ఏలూరు టౌన్: నేటి కోట్లాదిమంది పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోన్న సంక్షేమ పాలనకు నాడు ప్రజాసంకల్ప పాదయాత్రతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాందిపలికారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ప్రజా సంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర స్ఫూర్తితో రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ రాబోయే 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. దివంగత మహానేత వైఎస్సార్ నాడు చేసిన పాదయాత్ర సంచలనం సృష్టించిందని, కాంగ్రెస్ పార్టీకి అధికారాన్ని తెచ్చిపెట్టిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో అభివృద్ధికి రాజన్న బాటలు వేశారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్రతో రాష్ట్రానికి దిశా నిర్దేశం చేశారనీ, నేటి అభివృద్ధి, సంక్షేమానికి ఆనాడే బీజం పడిందని చెప్పారు. టీడీపీ చంద్రబాబు కూడా రాష్ట్రంలో పాదయాత్ర చేసినా, అబద్ధపు హామీలు, అమలుకాని వాగ్దానాలతో మభ్యపెడుతూ కుటిల రాజకీయాలు చేయడంతో ప్రజలు విశ్వసించలేదని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో ప్రజలు నేడు సంతోషంగా ఉన్నారని వివరించారు. ఏలూరు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా దుష్టచతుష్టయంతో పోరాడాలని పిలుపునిచ్చారు.

పేదలకు మేలు చేయడమే లక్ష్యం

ఏలూరు టౌన్: రాష్ట్రంలో ఏనాడు లేనివిధంగా పేదవానికి మేలు చేయటమే ప్రధాన అజెండాగా సీఎం జగన్ సంక్షేమ పాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాని అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఏలూరు నియోజకవర్గం పరిధిలో గృహ సారథుల నియామక ప్రక్రియపై పార్టీ నేతలు, కార్పొరేటర్లతో నాని సమీక్షించారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు పాలన చేరువ చేయగా ప్రస్తుతం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ కీలకమైన బాధ్యతలను అప్పగించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. ప్రతి సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లు పర్యవేక్షిస్తున్నారని, సచివాలయం పరిధిలో గృహసారథుల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పార్టీ పట్ల అభిమానం, విధేయత గల కార్యకర్తలను డివిజన్‌లోని క్లస్టర్‌ల ప్రాతిపదికన ప్రతి క్లస్టర్‌కు ఇద్దరు గృహ సారథులను నియమించాలన్నారు. ఇద్దరిలో ఒకరు మహిళ, ఒకరు పురుషుడు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ కార్పొరేటర్, సచివాలయ కన్వీనర్ల సమన్వయంతో గృహ సారథుల ఎంపిక చేపట్టాలని ఎమ్మెల్యే నాని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, మహిళా నాయకులు నున్న స్వాతిశ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయస్సులో పెళ్లి చేయడం నేరం

ఏలూరు రూరల్: చిన్న వయస్సులో బాలికలకు పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక కొద్దిరోజుల క్రితం వంగాయగూడెం ప్రాంతానికి చెందిన ఓ బాలిక ఇంటి నుంచి పారిపోయింది. పోలీసులు బాలికను వెతికి పట్టుకుని సోమవారం తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాలికతో పాటు తల్లినీ విచారించారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుకుంటుంటే పెళ్లి చేస్తానని తల్లి చెప్పడంతో పారిపోయానని బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ఆడపిల్లలను సైతం ఉన్నత విద్యావంతులను చేయడానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం అమలు చేస్తున్నారని వివరించారు. 18 ఏళ్లు నిండకుండా, బాలిక ఇష్టం లేకుండా పెళ్లి చేయడాన్ని చట్టం సమర్థించదని హెచ్చరించారు. మరోసారి పెళ్లి ప్రయత్నం చేస్తే పోలీసు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పారదర్శక పాలన అందిస్తున్న సీఎం జగన్


నాగులదేవునిపాడులో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, నాయకులు

దెందులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనతో ప్రజలందరి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం శ్రీరామవరంలో ప్రజాసంకల్ప పాదయాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. గాలాయగూడెం పంచాయతీ నాగులదేవునిపాడులో సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, పార్టీ నాయకులు, వార్డు మెంబర్లు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువత క్రమశిక్షణ అలవర్చుకోవాలి

దెందులూరు: యువత సత్ప్రవర్తన, క్రమశిక్షణ, స్వచ్ఛమైన జీవనవిధానాన్ని అలవర్చుకోవాలని డ్రగ్స్ సీఐ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ అధ్యక్షతన ఏఓ కరుణానిధి ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌కు యువత సహకారం పేరిట ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత ర్యాలీని ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ, సీఐ శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెమ్మల అభ్యున్నతే లక్ష్యం


70 రోజుల కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాని, మేయర్ నూర్జహాన్, భారతిదేవి


హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

ఏలూరు టౌన్: రాష్ట్రంలో మహిళా సాధికారితే ధ్యేయంగా, ప్రతి అక్కాచెల్లెమ్మల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులో 70వ రోజు సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నగరంలోని 38వ సచివాలయం పరిధిలో శాంతినగర్‌లో నిర్వహించారు. ప్రతి ఇంటికీ నాని వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ అన్నపనేని భారతిదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రీభారతి విద్యాసంస్థల అధినేత అన్నపనేని రవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేనివిధంగా ప్రతి అక్కాచెల్లెమ్మలకు మంచి చేయాలనే ఉన్నత లక్ష్యంతో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళతోనే సామాజిక అభివృద్ధి, ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించటం ద్వారా కుటుంబాలు సంతోషంగా ఉంటాయనే ఆలోచనతో జగనన్న పనిచేస్తున్నారని వివరించారు. సొంతిల్లు కల్పించటం ద్వారా జీవితంలో ధీమా, భరోసా కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, నాయకులు మైబాబు, మధ్యాహ్నపు బలరాం, బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, పిల్లంగోళ్ల శ్రీదేవి, చిలకపాటి డింపుల్, పాలిమేర దాసు, యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, గునిపూడి శ్రీనివాస్, తంగెళ్ల రాము, సుంకర చంద్రశేఖర్, బండారు కిరణ్, దొంగ రామాంజనేయులు, ప్రత్తిపాటి తంబి, పాలిమేర హరికృష్ణ, జిజ్జువరపు రమేష్, నున్న కిషోర్, గూడూరి ప్రసాద్, పాలడుగు మురళీశ్యాం తదితరులు ఉన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ

ఏలూరు రూరల్: దెందులూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం ఏలూరు మండలం మాదేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్నకాలనీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం కావాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ప్రతి లబ్ధిదారుడికీ రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. దీనికి తోడు డ్వాక్రా సంఘాల నుంచి రూ.35 వేలు చొప్పున అందిస్తున్నామని, సుమారు రూ.3 వేలు ఖర్చు కాగల ఉచితంగా విద్యుత్ కనక్షన్ ఇస్తున్నామని చెప్పారు. నిర్మాణానికి ఇసుక, సిమెంట్, ఐరన్ అందుబాటులో ఉంచామని, కాలనీల్లో బోర్లు వేసి నీటి వసతి కల్పించామని తెలిపారు. రోడ్లు అభివృద్ధి చేశామని వివరించారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు పలువురు లబ్ధిదారులు ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులతో కలిసి కమ్యూనిటీహాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సొంతగా ఇల్లు కట్టుకోలేని పేదలకు కాంట్రాక్టర్లతో మాట్లాడి నిర్మాణ పనులు చేపట్టేలా చూడాలని వారు ఎమ్మెల్యేకు సూచించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ కొరపాటి శ్రీరామ్‌ప్రభుదేవ, ఉపసర్పంచ్ నరహరిశెట్టి రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, పల్లెం ప్రసాద్, మండల కొండలరావు, జాలిపూడి రైతు సంఘం చైర్మన్ బొల్లిముంత రామ్మోహనరావు, వార్డు సభ్యుడు పంపుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	60	చామదుంపలు	52
వంకాయలు (తెలుపు)	28	ములక్కాడలు	10-12
బెండకాయలు	54	కంద	30
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	36
కాకర కాయలు	34-38	కీరా దోస	56
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	56
బీరకాయలు (పందిరి)	44	అల్లం	60
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	26	పాలకూర	1
దొండకాయలు	44	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	40	బఠాణీ	60
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-32

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	26
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	00
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	00

వినియోగదారుల చట్టం పట్ల అవగాహన కల్పించాలి


వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షుడిని కలిసిన విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): వినియోగదారుల చట్టం పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు డి.కోదండరామమూర్తి న్యాయ విద్యార్థులు సూచించారు. క్లినికల్ లీగల్ శిక్షణ నేపథ్యంలో భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో రెండో సంవత్సరం ఎల్ఎల్‌బీ విద్యార్థులు ఏలూరులోని కుటుంబ న్యాయస్థానం, జిల్లా వినియోగదారుల కమిషన్‌లను సోమవారం సందర్శించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు డి.కోదండరామమూర్తికి నమూనా దరఖాస్తు ఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా కోదండరామమూర్తి మాట్లాడుతూ రైతుల సమస్యల పట్ల స్పందించి గ్రామీణులకు చట్టాల పట్ల అవగాహన కల్గించాలన్నారు. కొన్న ప్రతి వస్తువుకూ తప్పక రశీదు పొందాలని సూచించారు. వినియోగదారులకు ఎటువంటి నష్టం కలిగినా కమిషన్ ఆశ్రయించవచ్చునన్నారు. రూ.5 లక్షల లోపు ఎటువంటి కోర్టు ఫీజు చెల్లించనక్కరలేదన్నారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు ఎస్ సురేష్ కుమార్, వి.శ్రీనాగలక్ష్మి, లా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందేలను అడ్డుకుంటాం

దెందులూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా అన్ని గ్రామాల్లో కోడిపందేలు, పేకాటలను అరికట్టేందుకు ప్రజలు, అధికారులు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందించాలని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల వీఆర్‌ఓలు, వీఆర్ఏలకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాంచారయ్య, సీనియర్ అసిస్టెంట్ హరిప్రసాద్ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలు, గుండాట సమాచారం మండలాధికారులకు, పోలీసులకు తెలియజేయాలన్నారు.

జూదరుల అరెస్టు

పెదపాడు: పేకాట ఆడుతున్న ఐదుగుర్ని అరెస్టు చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పోలీసు స్టేషన్ పరిధిలోని కొక్కిరపాడులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పెదపాడు ఎస్సై బి.నాగబాబు తన సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసారు. నిందితుల నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

అలరించిన పౌరాణిక నాటకం



శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహిస్తున్న దృశ్యం, శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకంలోని సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విశేష పూజలు, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. స్వామి వారి నిత్య హోమాలు, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. సంగీత కళాకారిణి తాడిమేటి శుభ నిర్వహించిన భక్తి సంగీత విభావరి విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం హరి శ్రీనివాస శాస్త్రి రావణ వధ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7.30 గంటలకు శ్యామలాంబ కళానికేతన్ ఆధ్వర్యంలో ఎస్.సీతారామయ్య బృందం ప్రదర్శించిన శ్రీ కృష్ణ రాయబారం పౌరాణిక నాటకంలోని పడక సీను భక్తులను విశేషంగా అలరించింది. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి ఆంధ్ర రవిశంకర్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

13న సంక్రాంతి సంబరాలు

దెందులూరు : కొవ్వలి హైస్కూల్లో ఏలూరు జిల్లా జీవవైవిధ్య యాజమాన్యం కమిటీ, స్వచ్ఛంద సేవా సంస్థ గ్రామదీప్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మధ్యాహ్నం 2 గంటలకు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు వెలమాటి మనోహరి తెలిపారు. రంగవల్లులు, సంక్రాంతి అలంకరణ పోటీలు నిర్వహిస్తామన్నారు.

చాటపర్రులో సంక్రాంతి క్రీడా సంబరాలు


వాలీబాల్ షాట్ కొడుతున్న వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్


చాటపర్రులో సంక్రాంతి సంబరాల్లో సీఐ ఆదిప్రసాద్, ఎస్సై లక్ష్మణబాబు

ఏలూరు టౌన్: యువత సంప్రదాయ సంక్రాంతి వేడుకలు నిర్వహించుకునేలా ప్రోత్సహిస్తున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు వన్‌టౌన్ సీఐ బోనం ఆదిప్రసాద్ హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ సర్కిల్ పరిధిలో ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో సంక్రాంతి క్రీడా సంబరాలు నిర్వహించారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాల మేరకు ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు సూచనలతో రూరల్ ఎస్సై లక్ష్మణబాబు పర్యవేక్షణలో చేపట్టిన సంబరాల్లో ముఖ్యఅతిథిగా హాజరైన వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్ యువత చెడు మార్గాలవైపు మళ్లకుండా సంప్రదాయ క్రీడలు నిర్వహించటం అభినందనీయమన్నారు. జూదం, కోడిపందాలు, పేకాట, గుండాటలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సీఐ ఆదిప్రసాద్ కొద్దిసేపు వాలీబాల్ ఆడుతూ యువతలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో చాటపర్రు సర్పంచ్ గుడిపూడి రఘు, గ్రామస్తులు, 200 మందికిపైగా యువత, గ్రామస్తులు ఉత్సాహంగా క్రీడా సంబరాల్లో పాల్గొన్నారు.